


మల్లన్న సాగర్ టు మూసీ!
మూసీ సుందరీకరణకు కార్యాచరణ వేగవంతమైంది. ఇందులో భాగంగా మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. -10లో




సమ్మర్ జోష్..
సమ్మర్ జోష్‌కు నగరం సంసిద్ధమవుతోంది. గేమ్స్, వినోద- విజ్ఞాన కార్యక్రమాలు, సాహస క్రీడలు వాటర్ గేమ్స్ తదితర వేదికలు ఏర్పాటు కానున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/22.0

నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



ఆర్థిక పరిస్థితులు, అనారోగ్య సమస్యలతోనే చనిపోతున్నాం

ఘటనా స్థలంలో చంద్రశేఖర్ రెడ్డి రాసిన సూసైడ్ నోట్

లాలాపేట: హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 రవీంద్రనగర్‌లో సోమవారం రాత్రి దంపతులు చంద్రశేఖర్‌రెడ్డి (44), కవితారెడ్డి (35), వీరి ఇద్దరు పిల్లలు శ్రీతారెడ్డి(13), విశ్వనాథ్‌రెడ్డి (10) మృతి చెందడంతో స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఆర్థిక సమస్యల కారణంగానే నలుగురు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్‌ను బట్టి తెలుస్తోందని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు భావిస్తున్నారు. ఆర్థిక పరిస్థితులతో పాటు అనారోగ్య సమస్యల కారణంగానే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజేందర్ ప్రాథమికంగా నిర్ధారించారు. మంగళవారం గాంధీ హాస్పిటల్‌లో నలుగురి మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా మన లక్ష్యం: ముషారఫ్ ఫరూఖీ


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ముషారఫ్

సాక్షి, సిటీ బ్యూరో: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ పేర్కొన్నారు. వేసవి కార్యాచరణలో భాగంగా సెంట్రల్ సర్కిల్ పరిధిలో చేట్టిన పనులపై మంగళవారం ఆయన సమీక్షించి మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సెంట్రల్ హైదరాబాద్ సర్కిల్‌లో పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్లు చర్యలు లేకపోవడంతో గత ఏడాది కొన్ని ప్రాంతాల్లో ఓవర్ లోడింగ్ సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని 35, 11 కేవీ ఫీడర్లు, సబ్‌స్టేషన్లలో 7 పీటీఆర్‌ఎస్, 149 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం గోల్కొండ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రెండు 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను, డైమండ్ హిల్స్ 11 కేవీ ఫీడర్, సయ్యద్ అక్తర్ ఫీడర్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డా. నర్సింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ చక్రపాణి, ఎస్‌ఈలు వెంకన్న, కరుణాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

మణికొండ: వారంతా ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు. ఓ మిత్రుడు తెచ్చిన కారులో మరో ఐదుగురు కలిసి కళాశాల నుంచి ఇంటికి వెళ్తున్నారు. మితిమీరిన వేగం కారణంగా కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక సీటులో కూర్చున్న మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మిగతా నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నార్సింగి పోలీస్ స్టేషన్, కోకాపేట సెక్టార్ ఎస్సై మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో సికింద్రాబాద్ వారాసిగూడకు చెందిన శ్రీకర్ (18), ఇతర ప్రాంతాలకు చెందిన వివేక్‌రెడ్డి, హేమసాయి, సృజన్, కార్తికేయ, హర్షవర్ధన్‌లు సీఎస్‌ఈ మొదటి సంవత్సరం చదువుతున్నారు. శ్రీకర్ మంగళవారం కళాశాలకు తన కారులో వచ్చాడు. కళాశాల అయిపోయాక అతని మిత్రులతో కలిసి ఇంటికి వెళ్తున్న క్రమంలో కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌లోని ఖాళీ రోడ్లపై అతివేగంతో కారు నడపడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవింగ్ చేస్తున్న శ్రీకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని వెనక సీటులో కూర్చున్న హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా నలుగురికి స్వల్పగాయాలు కావటంతో సమీపంలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులందరి వయసు 18 సంవత్సరాలు కావటం.. వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉందా..? ప్రయాణిస్తున్న సమయంలో మద్యం తాగారా? అనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మురళీధర్ తెలిపారు.


ఘటనా స్థలంలో విచారణ చేస్తున్న పోలీసులు

అక్రమాల ప్లానింగ్

యథేచ్ఛగా అనుమతి లేని నిర్మాణాలు

- అవినీతి పునాదులపై ఆకాశాన్నంటే సౌధాలు
- నిబంధనలకు నిలువునా పాతర
- గ్రేటర్‌లో ఇష్టానుసారంగా ఉల్లంఘనలు
- అంతస్తుకు రూ. 2 లక్షల చొప్పున ఆమ్యామ్యాలు
- మారని టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహారం
- ఫిర్యాదులను పట్టించుకోని దుస్థితి


కూకట్‌పల్లి నియోజకవర్గంలో

మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో 200 గజాల నుంచి మొదలుపెడితే ఎక్కువ విస్తీర్ణంలో కడుతున్న అపార్టుమెంట్లలో సైతం నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. అక్కడ డిమాండ్ ఎక్కువ కావడంతో అదనపు నిర్మాణాలకు ఒక్కో అంతస్తుకు రూ. 5 లక్షల నుంచి బేరం మొదలుపెట్టి జేబులు నింపుకొంటున్న అవినీతి అధికారులు వాటిపై చర్యలు తీసుకోవడం లేదు. అన్ని జోన్లలోని అధికారులూ ఫిర్యాదు చేస్తే అడ్డుకోవాల్సిందిపోయి అక్రమార్కులకు ఫిర్యాదుదారుల వివరాలు చెబుతున్నారు. దాంతో ఫిర్యాదు చేసేందుకు పలువురు వెనుకాడుతున్నారు.

సెట్‌బ్యాక్‌ల సంగతేంటి..?

- 120 గజాల్లోపు స్థలాల్లో , జీ+1 నిర్మాణాల్లో సెట్‌బ్యాక్‌లు పట్టించుకోవడం లేదు.
- 150 గజాలు మించి నిర్మించేవారు చుట్టుపక్కల ఉన్న భవనాల దాకా తమ సెల్లార్లు తవ్వుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత నవంబర్‌లో మాదాపూర్ సిద్ధిఖ్‌నగర్‌లో జరిగిన ఉదంతమే ఇందుకు ఉదాహరణ.
- కేపీహెచ్‌బీ వంటి ప్రాంతాల్లో ఈడబ్ల్యుఎస్‌కు చెందిన పాత నివాస అపార్టుమెంట్లను అంతస్తులు పెంచి హాస్టళ్లుగా మార్చారు. స్థానికులు ఆందోళనలు చేసినా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు.

సిబ్బంది లేమీ ఓ కారణమే..

టౌన్‌ప్లానింగ్ విభాగంలో తగినంత సిబ్బంది లేకపోవడమూ జరుగుతున్న పరిణామాలకు కారణమే. 240 మంది టీపీఎస్‌లు ఉండాల్సిన చోట 22 మంది మాత్రమే ఉన్నారు. ఏసీపీ స్థాయి అధికారులు సైతం నలుగురు తక్కువగా ఉన్నారు. ఉన్నవారినీ బదిలీ చేయరు. అక్రమార్జనకు ఎక్కువ అవకాశమున్న శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్ వంటి జోన్లలోని వారు ఇతర ప్రాంతాలకు వెళ్లరు. బదిలీ చేసినా ఏరియా మారుతుందే తప్ప బుద్ధి మారదని జీహెచ్‌ఎంసీ వర్గాలే చెబుతున్నాయి.

పేరుకే 'టాస్క్‌ఫోర్స్'.. చేసేది వసూళ్లే !

అక్రమ నిర్మాణాలు గుర్తించేందుకు, కూల్చివేసేందుకు అనుమతులిచ్చే వారితో సంబంధం లేకుండా టాస్క్‌ఫోర్స్ టీమ్స్ ఏర్పాటు చేశారు. టీమ్స్‌లో అధికంగా ఉన్న ఔట్ సోర్సింగ్ (న్యాక్) ఇంజినీర్లు అక్రమ నిర్మాణాలను అడ్డుకోకుండా తమ జేబులు నింపుకోవడంపైనే శ్రద్ధ చూపుతున్నారనే విమర్శలున్నాయి. పై అధికారులకూ వాటాలున్నాయనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులూ పట్టించుకోకపోవడం ఇందుకు ఊతమిస్తోంది.

మొక్కుబడి నోటీసులు..

ఏదైనా దుర్ఘటన జరిగినప్పుడు తమ మీదకు రాకుండా ఉండేందుకు మొక్కుబడిగా నోటీసులు మాత్రం ఇస్తున్న అధికారులు తదుపరి చర్యలు తీసుకోవడం లేదు. అక్రమ నిర్మాణమని భవనాన్ని సీజ్ చేసినా.. లోపల నిర్మాణాలు జరుపుతున్నారు. అందుకు అధికారులే సహకరిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. కూల్చివేతలకు తమకు తగిన బలగం, బలం లేవని అధికారులు దాటవేస్తున్నారు. కోర్టులు అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని తీర్పులిచ్చినా పట్టించుకోవడం లేదు. ఇలాంటి ఘటనపైనే జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారుల తీరుపై ఇటీవల సీరియస్ అయ్యారు.


ముషీరాబాద్ నియోజకవర్గంలో

తేదీ	మొత్తం ఫిర్యాదులు	టౌన్ ప్లానింగ్‌వి
10-3-2025	59	34
03-03-2025	107	62
24-02-2025	82	46
17-02-2025	57	25

ఇవి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే 'ప్రజావాణి'కి అందిన ఫిర్యాదులు. ఏ వారం చూసినా టౌన్‌ప్లానింగ్‌వే అధికం. ఇవే ఎందుకు ఎక్కువగా వస్తున్నాయి? అందిన ఫిర్యాదుల్ని అసలు పరిష్కరిస్తున్నారా? అంటే లేదనే సమాధానమే ప్రజల నుంచి వస్తోంది. సర్కిళ్లు, జోన్లలో పరిష్కరించడం లేదని ప్రధాన కార్యాలయానికి వచ్చినా ఇక్కడా అదే పరిస్థితి ఎదురవుతోందని ఎల్‌బీ నగర్‌కు చెందిన సోమశేఖర్ ఆవేదన వ్యక్తంచేశారు.

టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి అందే ఫిర్యాదుల్లో ఎక్కువగా అక్రమ నిర్మాణాలవే. అందుకు కారణం వారి ఉల్లంఘనల వల్ల ఇరుగుపొరుగున ఉన్న తమకు రావాల్సిన గాలి, వెలుతురు సరిగా రావడం లేదని, ఏదైనా ప్రమాదం జరిగితే అంబులెన్సులు సైతం తిరగలేని విధంగా ఉంటున్నాయని, ఆ ఫిర్యాదుల్ని పరిష్కరించాల్సిన స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారులు చాలావరకు పట్టించుకోని పరిస్థితి. అందుకు కారణం టౌన్‌ప్లానింగ్‌లో అవినీతి మూడు అంతస్తులు.. ఆరు లక్షలుగా వర్ధిల్లుతోంది. అనుమతి లేకుండా నిర్మించిన భవనాలకు అంతస్తుకు రూ. 2 లక్షల వంతున తీసుకుని చూసీ చూడనట్లు వ్యవహరిస్తారనేది బహిరంగ రహస్యమే. అంతేకాదు.. నిర్మాణం పూర్తి కాకముందే అన్నీ సవ్యంగా నిర్మించినట్లు ఓసీలు ఇస్తున్న అధికారులు కూడా ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ అనుమతులివ్వడమే కాక నిర్మాణం పూర్తికాకముందే ఓసీ ఇవ్వడం హైడ్రా పరిశీలనలో వెలుగుచూసింది. నగరంలో భూమి ధర బంగారాన్ని మించి పోవడంతో అంగుళం స్థలం కూడా వదలకుండా అంతస్తులపై అంతస్తులు నిర్మిస్తున్నారు. ఇటీవలి కాలంలోనే భవనాలు కూలిన సందర్భాల్లో 40 గజాల్లోనే ఐదారంతస్తులు నిర్మించడం, సెట్‌బ్యాక్‌లు లేకపోవడం తదితర అవతవకలు వెలుగు చూశాయి. ఎప్పుడు, ఎక్కడ ప్రమాదాలు జరిగినా ఉల్లంఘనలు వెల్లడవుతున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

సస్పెండ్ చేయాలి

గోషామహల్ నియోజకవర్గం అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందని కార్పొరేటర్‌గా పోటీచేసిన ఎం. ఆనంద్ కుమార్ గౌడ్ 'ప్రజావాణి'లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. జ్ఞాన్ బాగ్ కాలనీ, సీనా హోటల్ గల్లి, శంకర్ బాగ్‌లు అక్రమ నిర్మాణాలకు అడ్డాలుగా మారాయని,ఆరేడంతస్తు భవనాలు వెలుస్తున్నాయని, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు.

నెలల తరబడి తిప్పుతున్నారు



జీహెచ్‌ఎంసీలో భవన నిర్మాణ అనుమతుల కోసం నెలల తరబడి తిప్పుకొంటున్నారు. గాజుల రామారంలో ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుని ఫీజు కూడా చెల్లించాను. మా కాలనీలోనే కొందరికి మాత్రం అనుమతులిచ్చి తమను ఇబ్బంది పెడుతున్నారు. – జూపల్లి జనార్ధ రావు, వెంకటాపయ్య నగర్

వసూళ్లకు ప్రైవేటు ఉద్యోగులు

టౌన్‌ప్లానింగ్ అధికారులు తమ కింద ప్రైవేటు ఉద్యోగులను పెట్టుకొని డబ్బు వసూలు చేస్తున్నారు. తనిఖీలు చేయడం లేదు. సొమ్ములు ముడితే అంతా ఓకే.. లేకుంటే కాదు అన్నట్లు పనిచేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్‌లో ఇతర అవకతవకల గురించి ప్రజావాణిలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశాను. ఏం చర్యలు తీసుకుంటారో చూడాలి.
– ఊరపల్లి శ్రవణ్, మల్కాజిగిరి కార్పొరేటర్



చిన్నపాటి సాకులతో..



జీహెచ్‌ఎంసీ అధికారులు చిన్న చిన్న సాకులతో అనుమతుల్వివడం లేదు. ప్రభుత్వం అనుమతుల్ని సరళీకరించామని చెబుతున్నా, అధికారులు నెలల కొద్దీ తిరిగినా అనుమతి ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులు కల్పించుకొని సామాన్యుడికి ఇబ్బందులు లేకుండా అనుమతులొచ్చేలా చర్యలు తీసుకోవాలి. – నరేష్, ఆస్‌బెస్టాస్ కాలనీ

సొరంగ మార్గానికి సరే



ఎలివేటెడ్ కారిడార్‌కు ఎయిర్ పోర్ట్ అథారిటీ క్లియరెన్స్

- ప్యారడైజ్ నుంచి డైరీఫామ్ వరకు నిర్మాణం
- బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ వద్ద 600 మీటర్ల టన్నెల్
- రూ.15,50 కోట్లతో నిర్మించనున్న హెచ్ఎండీఏ

సాక్షి, సిటీబ్యూరో: ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి తాజాగా అనుమతి లభించనుంది. ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫామ్ వరకు 5.4 కిలోమీటర్ల కారిడార్ మార్గంలో బేగంపేట్ విమానాశ్రయం వద్ద సుమారు 600 మీటర్ల పొడవుతో సొరంగ మార్గాన్ని నిర్మించనున్నారు. విమానాల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని ఎలివేటెడ్‌కు ప్రత్యామ్నాయంగా సొరంగ మార్గం నిర్మించాల్సి ఉంటుందని హెచ్ఎండీఏ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ నుంచి అనుమతి లభించడంతో త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభించనుంది.

డెయిరీఫామ్ ఎలివేటెడ్ ప్రత్యేకతలు..

ప్యారడైజ్ నుంచి సికింద్రాబాద్, తాడ్‌బండ్, బోయిన్‌పల్లి మీదుగా డెయిరీఫామ్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ కోసం రూ.652 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు. భూసేకరణ కోసం అయ్యే ఖర్చులతో కలిపి ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.1,550 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు వల్ల నగరానికి ఉత్తరం వైపు వాహనాల రాకపోకలు సులభతరం కానున్నాయి. ప్రస్తుతం సుచిత్ర నుంచి మేడ్చల్ రూట్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. డెయిరీఫామ్ ఎలివేటెడ్ అందుబాటులోకి వస్తే జంక్షన్ రహితమైన, సిగ్నల్‌రహితమైన, నిరాటంకమైన వాహనాల రాకపోకలు అందుబాటులోకి వస్తాయి.

- ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు మొత్తం 5.4 కిలోమీటర్ల కారిడార్‌లో 3.05 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్ ఉంటుంది.
- బేగంపేట్ ఎయిర్‌పోర్టు వద్ద 600 మీటర్ల అండర్‌గ్రౌండ్ టన్నెల్‌ను నిర్మిస్తారు.
- మొత్తం ఎలివేటెడ్ కారిడార్ 27 మీటర్ల వెడల్పు ఉంటుంది. ఇందులో 25 మీటర్లు క్యారేజ్‌వే, 2 మీటర్లు మీడియన్ ఉంటుంది. రెండు వైపులా క్రాష్ బారియర్స్‌ను ఏర్పాటు చేస్తారు.
- బోయిన్‌పల్లి జంక్షన్ వద్ద రెండు వైపులా 248 మీటర్ల నుంచి 475 మీటర్ల పొడవు, 8 మీటర్ల వెడల్పుతో ప్రవేశ, నిష్క్రమణ ర్యాంపులను ఏర్పాటు చేస్తారు. ఇక్కడ వాహనాలు 40 కిలో మీటర్ల వేగంతో మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది.
- తాడ్‌బండ్ జంక్షన్ వద్ద మలుపులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో 600 మీటర్ల టన్నెల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చు. జియో మెట్రిక్ ప్రత్యేకతలతో టన్నెల్ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ టన్నెల్ వల్ల వాహనాల రద్దీకి శాశ్వత పరిష్కారం లభించనుంది. 44వ జాతీయ రహదారి మార్గంలోనే కాకుండా కారిడార్‌కు ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో కూడా వాహనాల రాకపోకలు సులభతరం కానున్నాయి.

శామీర్‌పేట్ కారిడార్ ఇలా..

సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ ఔటర్‌రింగ్ రోడ్డు వరకు సుమారు 18.10 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సైతం హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. తిరుమలగిరి, అల్వాల్ మార్గంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు కోసం సుమారు 197 ఎకరాల భూమి సేకరణకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.2,232 కోట్లు అవుతుందని అంచనా. ఈ రూట్‌లో రక్షణ శాఖ నుంచి, హకీంపేట్ వద్ద ఎయిర్‌ఫోర్స్ నుంచి అనుమతి లభించాల్సి ఉందని పేర్కొన్నారు. శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్‌లో ఎయిర్‌ఫోర్స్ అనుమతి కీలకం కానుంది. ఈ అనుమతులు లభించిన వెంటనే టెండర్‌ల ప్రక్రియ చేపట్టనున్నారు.

వరాల జల్లు కురిసేనా!

రాష్ట్ర బడ్జెట్‌పై జలమండలి ఆశలు

- రూ.5,500 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు
- గోదావరి ఫేజ్- 2, 3, ఓఆర్ఆర్- 3, ఎస్టీపీ, సివరేజ్ ప్రాజెక్టు పనులు..

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర బడ్జెట్ 2025-26పై జలమండలి భారీ ఆశలు పెట్టుకుంది. బడ్జెట్‌లో సుమారు రూ.5,500 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించింది. గోదావరి రెండు, మూడో దశ పనులు, ఓటర్ రింగ్ రోడ్ తాగునీటి సరఫరా పథకం-3, ఎస్టీపీ, రుణాల చెల్లింపు, ఉచిత నీరు, విద్యుత్ రాయితీ కింద నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గతేడాది బడ్జెట్‌లో

దాదాపు రూ.5,650 కోట్ల ప్రతిపాదనలు చేయగా ప్రభుత్వం రూ.3385 కోట్ల నిధులు కేటాయించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో రూ.5,937 కోట్లను ప్రతిపాదిస్తే అప్పటి ప్రభుత్వం రూ. 1960.70 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం పెరిగిన అవసరాల దృష్ట్యా ఈసారి రూ.4 వేల కోట్లకుపైగా నిధులు కేటాయింపు జరగవచ్చని జలమండలి భావిస్తోంది.

గోదావరి ఫేజ్-2, 3 పనుల కోసం..

మహా నగర తాగునీటి అవసరాల కోసం మరో 20 టీఎంసీలను తీసుకొచ్చేందుకు గోదావరి తాగునీటి సరఫరా పథకం రెండు, మూడో దశ పనులకు జలమండలి ఇటీవల టెండర్లు ఆహ్వానించింది. ప్రాజెక్టును హైబ్రీడ్ యాన్యూటీ మోడల్ (హ్యామ్) చేపట్టనున్నారు. మొత్తం వ్యయంలో ప్రభుత్వ వాటా 40 శాతం, నిర్మాణ సంస్థ వాటా 60 శాతం భరించనున్నాయి. రాష్ట్ర వాటా కింద అవసరమైన నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలు సమర్పించింది. ఇప్పటికే గోదావరి మొదటి దశ కింద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని తరలిస్తుండగా, రెండు, మూడు దశల కింద మిగిలిన 20 టీఎంసీలు తరలించేందుకు పనులకు సిద్ధమైంది.

ఓఆర్ఆర్ తాగునీటి పథకం- 3 కోసం..

ఓటర్ రింగ్‌రోడ్ తాగునీటి సరఫరా పథకం-3 పనులు చేపట్టాలని జలమండలి నిర్ణయించింది. జీహెచ్ఎంసీ వెలుపల, ఔటర్ రింగ్ రోడ్ లోపలి పరిధిలో కొత్తగా వెలుస్తున్న ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగు నీటి సరఫరా చేసేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు సిద్ధమైంది. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే పనులు చేపట్టాలని యోచిస్తోంది. మహా నగరం చుట్టూ సుమారు 762 కిలో మీటర్లు విస్తరించి ఉన్న ఓటర్ రింగ్‌రోడ్ పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, విల్లాలకు నీటి సరఫరా కోసం మూడేళ్ల క్రితం ఓఆర్ఆర్ తాగు నీటి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మొదటి దశ పనులు పూర్తి కాగా, రెండో దశ పనులు శరవేగంతో సాగుతున్నాయి. తాజాగా ఆయా ప్రాంతాల శివార్లలో సైతం కొత్తగా వెలుస్తున్న గృహాలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు కూడా సురక్షిత తాగునీరు అందించేందుకు మూడో దశ పథకానికి సిద్ధ మవుతోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగ రానికి మణిహారమైన ఔటర్ రింగ్‌రోడ్డు వరకు జీహెచ్ఎంసీని విస్తరించడానికి కసరత్తు నేపథ్యంలో ఆ చుట్టూ ప్రాంతం శరవేగంగాఅభివృద్ధి చెందు తుండటంతో తాగునీటి డిమాండ్ పెరుగుతోంది.



మురుగునీటి శుద్ధికి..

వంద శాతం మురుగు శుద్ధి లక్ష్యంగా రెండేళ్ల క్రితం కొత్త ఎస్టీపీ ప్రాజెక్టు చేపట్టింది. మొత్తం మూడు ప్యాకేజీలుగా విభజించి 1259.50 ఎంఎల్డీల సామర్థ్యం గల 20 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మిస్తోంది. అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీ వినియోగిస్తూ ఎస్టీపీల నిర్మాణాలు చేపట్టింది. ప్యాకేజీ-1కింద అల్వాల్, మల్కాజిగిరి, కాప్రా, ఉప్పల్ సర్కిల్ ప్రాంతాల్లో రూ.1230.21 కోట్లతో 402.50 ఎంఎల్డీల సామర్థ్యం గల ఎస్టీపీలు, ప్యాకేజీ-2 కింద రాజేంద్రనగర్, ఎల్బీ నగర్ సర్కిల్ ప్రాతాల్లో రూ.1355.13 కోట్లతో 480.50 ఎమ్మెల్డీల సామర్థ్యం గల ఎస్టీపీలు, ప్యాకేజీ-3 కింద కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి సర్కిల్ ప్రాంతాల్లో రూ.1280.87 కోట్ల వ్యయంతో 376.50 ఎమ్మెల్డీల సామర్థ్యం గల ఎస్టీపీల నిర్మాణాలు చేపట్టగా ఇప్పటికే సగం ఇవి అందుబాటులోకి వచ్చాయి.

ఉచిత నీటిసరఫరా..

నగరంలోని గృహ కనెక్షన్లదారులకు నెలకు 20 వేల లీటర్ల వరకు ఉచితంగా నీటిని సరఫరా చేస్తోంది. ఇందుకోసం అయ్యే ఖర్చును భారీగానే భరించాల్సివస్తోంది. గత బడ్జెట్‌లో ఉచిత నీటి సరఫరా కోసం రూ.300 కోట్లు, అంతకుముందు ఆర్థిక సంవత్సరం రూ.550కోట్ల కేటాయించారు. ఈసారి ఉచిత నీటి సరఫరాతో పాటు విద్యుత్ రాయితీ కోసం తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి జలమండలి ప్రతిపాదించింది.



మల్లన్న సాగర్ టు మూసీ!

- గోదావరి నుంచి 20 టీఎంసీల నీళ్లు తరలింపు
- ఇందులో 5 టీఎంసీల నీటితో మూసీ శుద్ధి
- నదిపై 11 హెరిటేజ్ వంతెనల నిర్మాణం
- గాంధీ సరోవర్ లాగే బాపూఘాట్ అభివృద్ధి
- కేంద్రాన్ని రూ.14,100 కోట్ల ఆర్థిక సాయాన్ని కోరిన సర్కారు



సాక్షి, సిటీబ్యూరో: మూసీ పునరుజ్జీవానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. కంపుకొట్టే మూసీ నదిని సుందరీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు కార్యాచరణ వేగవంతం చేశారు. మూసీ ఆక్రమణలతో పాటు నది శుద్ధి కోసం కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీటిని తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 5 టీఎంసీల నీటిని మూసీ నది శుద్ధి కోసం..15 టీఎంసీల నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వినియోగించాలని సీఎం నిర్ణయించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా నీటిని మళ్లించేలా పనులు చేపట్టనున్నారు. గోదావరి నుంచి 5 టీఎంసీల నీటిని మూసీ పునరుజ్జీవం కోసం హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లకు మళ్లించి, శుద్ధి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే గోదావరి-మూసీ అనుసంధానం కోసం కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు.

రూ.14,100 కోట్ల ఆర్థిక సాయం..

ఒకప్పుడు భాగ్యనగర వాసుల తాగునీటి అవసరాలను తీర్చిన మూసీ నది..కాలక్రమంలో గృహ, పారిశ్రామిక వ్యర్థాల పారబోతతో కలుషితమైపోయింది. మూసీ పునరుజ్జీవం చేపట్టాలంటే ముందుగా నది పరివాహక ప్రాంతంలోని ఆక్రమణలను తొలగించడంతో పాటు నదిలో పారబోస్తున్న కలుషితాలను అడ్డుకోవడం ప్రధాన లక్ష్యం. ఇప్పటికే తొలగించాల్సిన ఆక్రమణలను మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు గుర్తించారు. త్వరలోనే వాటిని తొలగించి, బాధితులకు పునరావాసం కల్పించనున్నారు. ఈమేరకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం రూ.14,100 కోట్ల ఆర్థిక సాయాన్ని కోరుతూ రాష్ట్ర సర్కారు కేంద్రానికి లేఖ రాసింది.

గాంధీ సరోవర్ మాదిరిగా..

కేదర్‌నాథ్‌లోని గాంధీ సరోవర్ మాదిరిగా బాపూఘాట్‌ను అభివృద్ధి చేయాలని సీఎం నిర్ణయించారు. ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.5 కి.మీ., అలాగే హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 8.5 కి.మీ. మూసీ నదీ సుందరీకరణకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఆయా మార్గంలో రక్షణ శాఖకు చెందిన 222.27 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని కేంద్ర రక్షణ శాఖకు లేఖ రాశారు. అలాగే మూసీ నదిపై 11 చోట్ల హెరిటేజ్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. రూ.1,000 కోట్ల నిర్మాణ వ్యయాన్ని అంచనా వేశారు. ఇప్పటికే బాపూఘాట్ వద్ద మూసీ పునరుజ్జీవం పనులకు డీపీఆర్ రూపొందగా.. ఆమోదం కోసం కేంద్రానికి రాష్ట్ర పభుత్వం పంపించింది. ఈ ఏడాది బాపూఘాట్ వద్ద 90 శాతం పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

బిల్డర్ ఇంట్లో చోరీకి పాల్పడిన మహిళల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, నగలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-22లో నివసించే ప్రముఖ బిల్డర్, జీవీబీఆర్ నిర్మాణ రంగ సంస్థ ఎండీ జీవీ శేఖర్‌రెడ్డి ఇంట్లో భారీగా నగలు, నగదు చోరీ చేసిన ఘటనలో ఐదుగురు మహిళలను జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..శేఖర్‌రెడ్డి ఇంట్లో గత రెండు సంవత్సరాల నుంచి హసీనా, వహీదా, అనూష అనే ముగ్గురు యువతులు పనిచేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం యజమాని బెడ్‌రూమ్‌లో డ్రెస్సింగ్ టేబుల్ నుంచి రూ.7.50 లక్షల నగదు, రూ.28.50 లక్షల విలువ చేసే నగలు చోరీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి అనుమానితులు హసీనా, వహీదా, అనూషలను విచారించారు. వహీదా తాను చోరీ చేసిన ఆభరణాలను తన తల్లి సలీమాకు పంపించింది. అలాగే అనూష రూ.3 లక్షల నగదు తన తల్లి ఆదిలక్ష్మికి పంపించింది. డబ్బుపై ఆశతో హసీనా తనతో పాటు పనిచేస్తున్న వహీదా, అనూషలను రెచ్చగొట్టి ఈ దొంగతనానికి ఉసిగొల్పింది. ముగ్గురూ కలిసి యజమాని కళ్లుగప్పి చేతివాటం ప్రదర్శించారు. నగలు అమ్ముకుని, తలాకొంత పంచుకుని ఏదైనా వ్యాపారం చేస్తే మరింత మెరుగైన జీవితం గడపవచ్చని హసీనా ఈ ఇద్దరికి నూరిపోసింది. డబ్బులతో తమ బతుకులు మార్చుకుందామని, మరింత బాగా బతకవచ్చని భావించిన వహీదా, అనూషలు కూడా ఈ దొంగతనంలో పాలుపంచుకున్నారు. ఈ ఘటనలో హసీనా, వహీదా, అనూషలతో పాటు సలీమా, ఆదిలక్ష్మిలను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి మొత్తం నగలు, రూ.4 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'బల్కంపేట'కు కేంద్రం నిధులు

- ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి రూ.4.21 కోట్లు
- పర్యాటక అభివృద్ధిలో భాగంగా కేటాయింపు
- 'ప్రసాద్' పథకం కింద అన్నదాన సత్రం..
- జీ ప్లస్ 3 భవనంగా నిర్మాణానికి డిజైన్..
- అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాళ్ల నిర్మాణం..



ఎల్లమ్మ ఆలయం సమీపంలో నిర్మించనున్న మూడంతస్తుల భవనం నమూనా

సనత్‌నగర్: భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతోన్న చారిత్రక బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిపై కేంద్రం భక్తిని చాటుకుంది. బల్కంపేట అభివృద్ధికి నిధులు అందించేందుకు ముందుకువచ్చింది. పర్యాటక అభివృద్ధిలో భాగంగా కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రసాద్' పథకం కింద అమ్మవారి ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మంగళవారం ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. 'ప్రసాద్' స్కీంలో భాగంగా ఎల్లమ్మ ఆలయం వద్ద జీ ప్లస్ 3 భవనంగా అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. దూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తుల ఆకలి తీర్చే లక్ష్యంగా అన్నదాన సత్రం నిర్మించాలని తలంచారు. ప్రస్తుతం ఆలయం వెనుక ఉన్న కల్యాణ మండపం స్థానంలో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఇప్పటికే నిష్ణాతులైన ఆర్కిటెక్చర్‌తో భవనం డిజైన్ తయారు చేయించారు. సెట్‌బ్యాక్ వదిలి జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం ఈ భవనాన్ని నిర్మించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో ఉన్న అత్యాధునిక కిచెన్ శైలిలో ఇక్కడ కిచెన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదించారు.

ఒకేసారి 200 మందికి భోజనం..

జీ ప్లస్ 3 భవనంగా నిర్మించే అన్నదాన సత్రంలో ఒకేసారి 200 మంది భోజనం చేసేలా డైనింగ్ హాళ్లను డిజైన్ చేశారు. రెండు ఫ్లోర్లను డైనింగ్ హాల్‌కు, ఒక ఫ్లోర్ మొత్తం కిచెన్‌కు కేటాయించనున్నారు. అన్నదాన సత్రానికి విచ్చేసే భక్తులకు ఒక ద్వారం, అలాగే భోజనం చేసి బయటకు వెళ్లేందుకు ఎగ్జిట్ ద్వారాన్ని ఏర్పాటు చేయనున్నారు. లిఫ్ట్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. కిచెన్ నుంచి నేరుగా డైనింగ్ హాల్‌లోకి వంటకాలు వెళ్లేలా లిఫ్ట్‌ను ఏర్పాటుచేయనున్నారు. ఇంకా ఈ భవనానికి సోలార్ ప్యానెల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా డిజైన్‌ను రూపొందించారు. అలాగే ఫైర్ స్టేర్‌కేస్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు.

ప్రతి ఆదివారం 25–30 వేల మంది భక్తులు

ప్రతి ఆది, మంగళవారాల్లో ఎక్కువగా అమ్మవారిని దర్శించుకుంటారు. జంట నగరాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని నలుమూలల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. అత్యధికంగా ప్రతి ఆదివారం సగటున 25–30 వేల మంది, మంగళవారం 15–20 వేల మంది వస్తుంటారు. కొంతమంది మొక్కులు తీర్చుకుని అక్కడే భోజనాలు వండుకుని తిని వెళ్తుంటారు. చాలామంది అమ్మవారి దర్శనం చేసుకుని వెనుదిరిగే క్రమంలో ఎక్కడ భోజనం చేయాలో అర్థం కాదు. అలాంటి వారి ఆకలిని తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం పర్యాటక అభివృద్ధిలో భాగంగా 'ప్రసాద్' పథకం కింద అన్నదాన సత్రం నిర్మాణానికి ముందుకువచ్చింది.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హర్షం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని ప్రసాద్ పథకం కింద ఎంపిక చేసి అభివృద్ధికి చర్యలు తీసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర షెకావత్ 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ప్రకటనకు ఆయన స్పందించి కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్



చార్మినార్: గంజాయి రవాణాతో పాటు విక్రయాలు జరుపుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.11 లక్షల 30 వేలు విలువ చేసే 30.70 కేజీల ఎండు గంజాయి, 3 మొబైల్ ఫోన్లు , 2 ట్రాలీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డిప్యూటీ కమిషనర్ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముర్గీచౌక్‌లో మహమ్మద్ యాసిన్ ఇంటిపై హుస్సేనీ ఆలం పోలీసులతో కలిసి సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 30.70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉత్తర ప్రదేశ్ రాంపూర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ యాసిన్ సిటీకి బతుకుదెరువు కోసం వచ్చి ముర్గీచౌక్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అధికంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఒడిశాకు చెందిన గోపాల్ ఖరా, ఉత్తమ్ తామెల్‌తో కలిసి గంజాయి వ్యాపారం ప్రారంభించారు. కొద్దిరోజుల క్రితం యాసీన్ ఒడిశాకు వెళ్లి అక్కడ గోపాల్, ఉత్తమ్‌ల సాయంతో 30 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. వారితో పాటు హైదరాబాద్‌కు తిరిగి వచ్చాడు. ధూల్‌పేటలోని కస్టమర్‌కు గంజాయి అందజేయడం కోసం నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు.

గుడిలో చోరీ..12 గంటల్లో దొంగల పట్టివేత

జీడిమెట్ల: గుడిలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను జీడిమెట్ల పోలీసులు 12 గంటల వ్యవధిలో పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. మంగళవారం జీడిమెట్ల పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్, ఏసీపీ హన్మంత్ రావు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్, డీఐ కనకయ్యలతో కలిసి వివరాలను వెల్లడించారు. లంగర్‌హౌజ్, టోలీచౌకి ప్రాంతానికి చెందిన ఇద్దరు దొంగలు సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో గాంధీనగర్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలోకి ప్రవేశించి..గర్భగుడి తలుపులు తెరిచి పంచలోహ విగ్రహాలు, ఇతర పూజా వస్తువులు ఎత్తుకెళ్లారు. ఉదయం గుడికి వెళ్లిన ఆలయ అధ్యక్షుడు కోనేటి వీరవెంకట సత్యనారాయణ దొంగతనం విషయాన్ని తెలుసుకుని సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడిన దృశ్యాలను గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా విడిపోయి...సీసీ కెమెరాల పరిశీలనతో పాటు టెక్నికల్‌గా విచారణ జరిపి సాయంత్రం 7 గంటల వరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించి ఇద్దరిని రిమాండుకు తరలించారు. వారి నుండి రూ.95 వేలు విలువచేసే పంచలోహ విగ్రహాలు, వస్తువులు, రాగి సామాన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా గుడిలో చోరీ విషయం తెలిసి స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారికి నచ్చచెప్పి శాంతింపజేశారు. కాగా మంగళవారం ఉదయం గాంధీనగర్‌లో పోలీసులు పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. హిందూవాహిని ఆధ్వర్యంలో ప్రజలు పెద్దఎత్తున గాంధీనగర్ చేరుకుని నిరసనలో పాల్గొన్నారు. పోలీసులు వెంట వెంటనే ఆందోళన చేపట్టిన వారిని జీడిమెట్ల స్టేషన్‌కు తరలించి కొంతమందిని ఇళ్లవద్దనే హౌజ్ అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారులు ఉరుకులు పరుగులు పెట్టడంతో పోలీసులు స్వల్పంగా లాఠీ చార్జీ చేశారు.

తల్లీ కూతుళ్లను హత్య చేసిన నిందితులకు రిమాండ్



అరవింద్‌కుమార్, లక్ష్మి

జవహర్‌నగర్: యాప్రాల్‌కు చెందిన ఉడుగుల సుశీల (60), ఆమె కుమార్తె జ్ఞానేశ్వరి (45)ని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివాహానికి అడ్డు వస్తున్నారనే కారణంతో ప్రియురాలు లక్ష్మితో కలిసి అరవింద్‌కుమార్ గుప్తా అనే వ్యక్తి ఇటీవల ఈ ఘాతుకానికి పాల్పడిన విషయం విదితమే. జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసులో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ నెల 10వ తేదీన అరవింద్ కుమార్ గుప్తాను, 11వ తేదీన లక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



బంజారాహిల్స్: పంజాగుట్ట చౌరస్తా నుంచి అమీర్‌పేట వరకు రోడ్డుకు రెండువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలు, డబ్బాలను పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు ఆపరేషన్ రోప్‌లో భాగంగా మంగళవారం తొలగించారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ పర్యవేక్షణలో పంజగుట్ట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయగా..ట్రాఫిక్ పోలీసులు సుమారు 70 ఆక్రమణలను ఈ సందర్భంగా తొలగించారు. దీంతో పాదచారులు, వాహనదారులు తేలికగా ముందుకు సాగడానికి అవకాశం ఏర్పడింది.

అరిష్టాలు తొలగిపోతాయని ఆలయంలో చోరీ

ఇద్దరు మహిళల అరెస్టు, పంచలోహ విగ్రహాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అమీర్‌పేట: అరిష్టాలు తొలగిపోతాయని గుడిలో పంచలోహ విగ్రహాలు దొంగిలించిన ఇద్దరు మహిళలను ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగతనం చేసిన 48 గంటల్లోనే నిందితులను పట్టుకున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ వెంకటరమణ, ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఎస్ఆర్‌నగర్ సమీపంలోని గురుమూర్తినగర్‌లో శ్రీ వినాయక ఆలయం గర్భగుడిలో శివపార్వతుల పంచలోహ విగ్రహాలు కనిపించడం లేదంటూ ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. శనివారం భక్తుల రూపంలో వచ్చిన మహిళలు తమ మాయమాటలతో అర్చకుడిని బోల్తా కొట్టించి విగ్రహాలు ఎత్తుకుళ్లినట్లు గుర్తించారు. బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌కు చెందిన స్వర్ణలత, పావని అనే మహిళలు ఆలయానికి వచ్చి..అర్చకుడు నవీన్‌కుమార్ తీర్థ ప్రసాదాలు పంచి పెడుతుండగా అదును చూసి విగ్రహాలను ఓ సంచిలో వేసుకుని పారిపోయారు. కొద్దిసేపటి తర్వాత అర్చకుడిని విగ్రహాలు కనిపించక పోవడంతో అధికారులకు సమాచారం అందించారు. గడిచిన రెండేళ్ల కాలంలో స్వర్ణలతో ఇంట్లో వరుసగా నలుగురు మరణించారు. తల్లిదండ్రులతో పాటు ఇద్దరు సోదరులు చనిపోవడంతో అరిష్టం వల్లే మృతి చెందారని భావించింది. నిత్యం పూజలందుకునే మహిమాన్వితులైన దేవుళ్ల విగ్రహాలను ఇంట్లో పెట్టుకుంటే మంచి జరుగుతుందని, సకల శుభాలు జరుగుతాయని నమ్మింది. పావనికి విషయాన్ని చెప్పి పథకం ప్రకారం ఇద్దరు విగ్రహాలను దొంగిలించినట్లు విచారణలో అంగీకరించారు. వారిద్దరికి ఎలాంటి నేర చరిత్ర లేదని పోలీసులు తెలిపారు. విగ్రహాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పబ్‌లో యువకునిపై దాడి

పంజగుట్ట: బిల్లు విషయంలో గొడవ జరగడంతో.. పబ్ మేనేజర్, బౌన్సర్లు ఓ యువకున్ని చితకబాదిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ముషీరాబాద్‌కు చెందిన పులిపాటి రాహుల్ ఈ నెల 9వ తేదీన రాత్రి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ చూసేందుకు ఓ యాప్ ద్వారా బేగంపేటలోని 10 డౌనింగ్ స్ట్రీట్ పబ్ బుక్ చేసుకున్నాడు. యాప్ ద్వారా బుక్ చేసుకుంటే అక్కడ 15 శాతం డిస్కౌంట్ లభిస్తుందని చెప్పడంతో బుక్ చేసుకున్నట్లు రాహుల్ పోలీసులకు తెలిపారు. కాని బిల్లు చెల్లించే సమయంలో డిస్కౌంట్ ఇవ్వకుండా..పూర్తి బిల్లు చెల్లించాలని మేనేజర్, వెయిటర్లు పట్టుబట్టారు. తాను 15 శాతం డిస్కౌంట్ అంటేనే బుక్ చేసుకున్నానని రాహుల్ వారితో చెప్పినా వినిపించుకోలేదు. ఈ దశలో గొడవ జరిగి..పబ్ మేనేజర్, పలువురు బౌన్సర్లు రాహుల్‌పై దాడి చేశారు. దీంతో సోమవారం రాహుల్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా..కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పాలిమర్స్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

జీడిమెట్ల: సుభాష్‌నగర్‌లోని ఓ పాలిమర్స్ పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు, ఫైర్ సిబ్బంది తెల్పిన మేరకు..ఐడీఏ జీడిమెట్ల సుభాష్‌నగర్‌లో ఓ వ్యక్తి లిబ్రా అండ్ లియో పాలిమర్స్ పేరిట కూరగాయలు ట్రాన్స్‌పోర్ట్ చేసే ప్లాస్టిక్ బాక్స్‌ల తయారీ పరిశ్రమను నడుపుతున్నాడు. పరిశ్రమలోపల బాక్స్‌లను తయారు చేసి..వెలుపల ఉన్న ఖాళీ స్థలంలో బాక్స్‌లు, ముడిసరుకును నిల్వచేస్తారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బాక్సులు, ముడి సరుకు నిల్వ చేసిన స్థలంలో మంటలు చెలరేగాయి. స్థానికులు జీడిమెట్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా వారు వెంటనే అక్కడికి చేరుకుని గంటపాటు శ్రమించి మంటలు అదుపుచేశారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ కేటగిరి-2 పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించారు. రూ.2000 అపరాధ రుసుముతో ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. ఈ నెల 11తో గడువు ముగియగా విద్యార్థుల విజ్ఞప్తి మేరకు తేదీ పొడిగించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్-2025కు ఇంత వరకు 9500 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.